మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310


## సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయండి



3లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 175 | మంగళవారం | 23 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



### సుక్మా అటవీ ప్రాంతంలో ఆయుధ కర్మాగారం ధ్వంసం

మన గళం, న్యూఢిల్లీ : ఇప్పటికే ఆపరేషన్ కగార్‌తో తీవ్ర ఒత్తిడిలో ఉన్న మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్వహిస్తున్న రహస్య ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. సుక్మా జిల్లా మీనాగట్టా అటవీ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు కలిసి 2 లో..





### కులాంతర వివాహం పేరిట గర్భిణీ

## కుమార్తె హత్య

### - తండ్రే నిందితుడు.. కర్ణాటకలో దారుణం

మన గళం, కర్ణాటక : కులాంతర వివాహం చేసుకుందనే కారణంతో గర్భిణీ కుమార్తెను తండ్రే హతమార్చిన అమానుష ఘటన కర్ణాటకలో చోటు చేసుకుంది. ఆరు నెలల గర్భిణీ అయిన 19 ఏళ్ల మాన్యను ఆమె తండ్రి ఇనుప రాడ్‌తో కొట్టి చంపిన ఘటన సమాజాన్ని కలచివేసింది. ఈ దాడిలో మాన్య అత్తమామలు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది మే నెలలో మాన్య తన కుటుంబ అభ్యంతరాలను లెక్కచేయకుండా కులాంతర వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కుటుంబం నుంచి ప్రాణహాని ఉందన్న అనుమానంతో కొద్ది నెలలు హావేరి జిల్లాలో దంపతులు 2 లో..

## హోంగార్డు పరీక్షకు రన్‌వేనే పరీక్షా కేంద్రం




### ఒడిశాలో 8 వేల మందితో పోలీసులకు పెద్ద సవాల్

మన గళం, భువనేశ్వర్ :హోంగార్డు నియామక పరీక్ష నిర్వహణలో ఒడిశా పోలీసులు వినూత్న ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరుకావడంతో ఏకంగా విమాన రన్‌వేపైనే రాత పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో 187 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అయితే పోస్టుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, దరఖాస్తుల సంఖ్య 2 లో..

### మద్యం విధానం వ్యాపారంలా కాకుండా


# ఆరోగ్యకర దిశలో ఉండాలి

- ఆదాయమే లక్ష్యంగా పాలసీలు వద్దన్న సీఎం
- ఎక్సైజ్ వ్యవస్థలో సంస్కరణలపై కీలక ఆదేశాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






మన గళం, అమరావతి : రాష్ట్రంలో మద్యం విధానాన్ని కేవలం వ్యాపారంగా చూడకుండా, సమాజానికి మేలు చేసేలా ఆరోగ్యకరమైన వృద్ధి సాధించే దిశగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే లక్ష్యం గా విధానాలు ఉండకూడదని స్పష్టం చేసిన ఆయన, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిగా పరిగణిస్తూ సమతుల్య నియంత్రణతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న లాటరీ విధానంలో మద్యం దుకాణాల కేటాయింపు, దరఖాస్తు రుసుము, మద్యం గుర్తింపు సంఖ్య, చిల్లర వ్యాపారులకు ఇచ్చే లాభం పెంపు వంటి అంశాలపై మరింత లోతైన కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. బార్‌లపై విధిస్తున్న అదనపు చిల్లర మద్యపు పన్ను మినహాయింపు అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మద్యం విక్రయ విధానాల్లో స్పష్టత, పారదర్శకత పెరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టడం, బెల్టు దుకాణాల నియంత్రణ, సాంకేతికత ఆధారంగా వ్యవస్థను ఆధునీకరించడం కీలకమని సీఎం పేర్కొన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాలని, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడకుండా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం విధానం సామాజిక బాధ్యతతో కూడినదిగా ఉండాలని ఆయన స్పష్టం 2 లో..



## పర్యాటకం, జీవనశైలి, ఉపాధికి కొత్త దిశ

### - తీర ఆర్థిక కేంద్రంగా అభివృద్ధికి నీతి ఆయోగ్ ప్రతిపాదన

మన గళం, విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం ప్రారంభమవుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలతో విశాఖపట్నం పరిధిలోని కైలాసగిరి నుంచి భీమిలి వరకు సుమారు ఇరవై ఐదు కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని సమగ్ర తీర ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక 2 లో..

## వైసీపీపై హోంమంత్రి తీవ్ర విమర్శలు

### - బాధ్యతారహిత ప్రతిపక్షంగా మారింది: అనిత




మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వైసీపీపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ పూర్తిగా బాధ్యతారహిత ప్రతిపక్షంగా తయారైందని మండిపడ్డారు. చిన్నపిల్లలతో నినాదాలు రాయిస్తూ ఫ్లెక్సీలు పెట్టించడం దుర్మార్గమైన రాజకీయమని వ్యాఖ్యానించారు. మేక తలలు నరికి రక్తాభిషేకాలు చేయిస్తూ సమాజంలో నేర ప్రవృత్తిని పెంపొందిస్తున్నారని వైసీపీ నేతలను దుయ్యబట్టారు. రౌడీ మూకలను నియంత్రించడం, శాంతిభద్రతలను కాపాడడం పోలీసులకు సవాలుగా మారిందని అన్నారు. ఇలాంటి చర్యలతో రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. వైద్య కళాశాలల భాగస్వామ్య విధానంలో ఉన్నవారిని అరెస్ట్ చేస్తామని వైసీపీ 2 లో..

## గ్రీన్ లోహాల భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ కీలక అడుగు



అమరావతి, మన గళం : పర్యావరణహిత పరిశ్రమల దిశగా ఆంధ్రప్రదేశ్ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో గ్రీన్ లోహాల తయారీకి బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ఏఎం గ్రీన్ గ్రూప్, జపాన్‌కు చెందిన ప్రముఖ వాణిజ్య సంస్థ మిట్సుయ్ అండ్ కోతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో తక్కువ కార్బన్ ఉద్గారాల ఆధారిత అల్యూమినియం విలువ శ్రేణి నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ ఒప్పం దం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరానికి 2 లో..

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ




కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా మావోయిస్టులు నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రం భద్రతా బలగాల కంట పడింది. అక్కడ భారీగా ఆయుధాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కూంబింగ్ సమయంలో సింగిల్ షాట్ రైఫిల్స్, డిటోనేటర్లు, భారీ పేలుడు పదార్థాలు, బాంబుల తయారీకి ఉపయోగించే సామగ్రిని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలనే లక్ష్యంగా తయారు చేసిన పేలుడు పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేసి పేల్చివేశారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలో మావోయిస్టుల దాడి యత్నాలకు గట్టి అడ్డుకట్ట పడింది. 2026 మార్చి చివరినాటికి దేశంలో మావోయిస్టు సమస్యను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల్లో కేంద్ర భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మృతి చెందగా, మరికొందరిని అరెస్ట్ చేశారు. అలాగే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం.

# కులాంతర వివాహం పేరిట గర్భిణీ కుమార్తె హత్య

నివసించారు. అనంతరం డిసెంబర్ 8న హుబ్బళ్లి జిల్లాలోని సొంత గ్రామానికి తిరిగి వచ్చారు. కులాంతర వివాహంపై ఆగ్రహంతో ఉన్న మాన్య తండ్రి ప్రకాష్, బంధువులు ఆదివారం ఉదయం భర్త, మామపై దాడికి ప్రయత్నించారు. అయితే వారు పొలంలో నుంచి తప్పించుకుని పారిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇదే కక్షతో సాయంత్రం సమయంలో మాన్య అత్తమామల ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. గర్భిణీ అయిన మాన్యపై ఆమె తండ్రి ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన అత్తమామలు రేణుకమ్మ, సుభాష్‌లను కూడా దుండగులు దారుణంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాన్య తండ్రి ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు బంధువులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు. కులం పేరిట జరిగే హింసాత్మక చర్యలపై కఠిన చర్యలు అవసరమని ఈ ఘటన మరోసారి చాటుతోంది.

# హోంగార్డు పరీక్షకు రన్‌వేనే పరీక్షా కేంద్రం



అసాధారణంగా పెరిగింది. నియామక పరీక్షకు 8,000 మందికిపైగా అభ్యర్థులు హాజరుకావడంతో, అంత మందికి ఒకే చోట పరీక్ష నిర్వహించడం పోలీస్ అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 16న ఉదయం జమదర్‌పాలి ప్రాంతంలోని ఎయిర్‌స్ట్రిప్ రన్‌వేపై రాత పరీక్ష నిర్వహించారు. రన్‌వే మొత్తం వేలాది మంది అభ్యర్థులు వరుసలుగా కూర్చొని పరీక్ష రాయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరీక్ష సజావుగా సాగేందుకు భారీగా పోలీసు బలగాన్ని మోహరించడంతో పాటు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టారు. హోంగార్డు పోస్టులకు కనీస అర్హత ఐదో తరగతి ఉత్తీర్ణత కాగా, ఉన్నత విద్యావంతులు కూడా వేల సంఖ్యలో దరఖాస్తు చేయడం చర్చనీయాంశమైంది. గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, ఎంసీఏ, ఎంబీఏ, కంప్యూటర్ సైన్స్ చదివినవారు, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు సైతం ఈ ఉద్యోగాల కోసం పోటీ పడటం రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

# పర్యాటకం, జీవనశైలి, ఉపాధికి కొత్త దిశ

రూపొందింది. ఈ ప్రాంతాన్ని 'విశాఖ బే సిటీ'గా తీర్చిదిద్ది, ప్రపంచ స్థాయి తీర నగరంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. ఈ ప్రాజెక్టులో అంతర్జాతీయ స్థాయి నగరాల నమూనాలను ఆధారంగా తీసుకుని రూపకల్పన చేయనున్నారు. సముద్ర తీర పర్యాటకం, ఆధునిక జీవనశైలి, వినోదం ప్రధాన కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంది. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రెండు వేల నుంచి రెండువేల ఐదు వందల వరకు కొత్త హోటల్ గదుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో విశాఖ ఎదగనుంది. తీరప్రాంతంలో నడక మార్గాలు, సైకిల్ మార్గాలు, జల క్రీడల ప్రత్యేక ప్రాంతాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే థీమ్ పార్కులు, ఆరోగ్య కేంద్రాలు, సాహస పర్యాటకానికి సంబంధించిన సదుపాయాలు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. సముద్ర తీరాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా, ప్రకృతి సౌందర్యాన్ని కాపాడుతూ అభివృద్ధి జరగనుందని స్పష్టం చేస్తున్నారు. పొడవైన తీరరేఖ, సహజ సౌందర్యం కలిగిన విశాఖపట్నం ఈ ప్రాజెక్టుతో దేశంలోనే ప్రముఖ తీరాభివృద్ధి కేంద్రంగా అవతరించనుందని అంచనా. పర్యాటకం, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి విశాఖ బే సిటీ కీలకంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మద్యం విధానం వ్యాపారంలా కాకుండా ఆరోగ్యకర దిశలో ఉండాలి

చేశారు. సచివాలయంలో నేడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కొత్త మద్యం విధానాల అమలు, వాటి ప్రభావంపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి పీయూష్ కుమార్, ప్రొహిబిషన్–ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ అమలు విభాగం డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు. ప్రజాహితమే కేంద్రంగా రాష్ట్ర మద్యం విధానం ఉండాలన్నది ప్రభుత్వ ధోరణిగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# వైసీపీపై హోంమంత్రి తీవ్ర విమర్శలు

అధినేత వైఎస్ జగన్ హెచ్చరించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అనిత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లోనే వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పారని, రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి బుద్ధి చెబుతారని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు హోంమంత్రి తెలిపారు. గంజాయి సాగును పూర్తిగా శూన్యానికి తీసుకొచ్చామని, రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైసీపీ నాయకులపై తమకు ఎలాంటి కక్ష లేదని, కక్షసాధింపులకు పాల్పడితే వారు రోడ్లపై తిరుగుతారా? అని ప్రశ్నిస్తూ విమర్శలకు తెరదించారు.

# గ్రీన్ లోహాల భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ కీలక అడుగు

పది లక్షల టన్నుల సామర్థ్యంతో కూడిన సమగ్ర గ్రీన్ అల్యూమినియం సముదాయం ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ పూర్తిగా పునరుత్పాదక శక్తి వనరులపై ఆధారపడి నడుస్తుంది. గాలి విద్యుత్, సౌర విద్యుత్, పంప్డ్ హైడ్రో విధానాల ద్వారా వంద శాతం శుభ్రమైన శక్తిని వినియోగించి ఉత్పత్తి చేపట్టనున్నారు. దీని ద్వారా పరిశ్రమాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం లభించనుంది. గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడం, దీర్ఘకాలిక ఉత్పత్తి కొనుగోలు భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో శుభ్రమైన శక్తి ఆధారిత పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా నిలపాలనే దిశగా ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కానున్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రత్యేకంగా కాకినాడ పరిసర ప్రాంతాలు ఈ ప్రాజెక్టుతో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనున్నాయి. ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పర్యావరణహిత పరిశ్రమల కోసం ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలవనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థిరమైన అభివృద్ధి, శుభ్రమైన శక్తి నాయకత్వం దిశగా రాష్ట్రం మరో పెద్ద అడుగు వేసినట్టుగా ఈ ఒప్పందం నిలుస్తోంది.

# మంగళగిరి జై టీడీపీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ





మన గళం, మంగళగిరి : మంగళగిరిలోని జై టీడీపీ జాతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను ప్రత్యక్షంగా కలిసి, వారి సమస్యలు, వినతులను మంత్రి స్వీకరించారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హత ఉన్న కేసుల్లో ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పరిపాలన ప్రజలకు చేరువగా ఉండాలని, సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యక్ష వినికిడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, అదే స్ఫూర్తితో పాలన సాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్రతి ప్రదేశానికి ఒక గతం ఉంటుంది

మన గళం, హైదరాబాద్ : నగర జీవనంలో వేగం పెరిగిన కొద్దీ, కొన్ని ప్రాంతాల గతం నెమ్మదిగా మరుగున పడుతుంది. అలాంటి ప్రాంతాల్లో అమీర్‌పేట ఒకటి. కానీ ఈ ప్రాంతానికి ఉన్న చరిత్ర, ఈ రోజు వేలాది మందికి ప్రేరణగా నిలుస్తోంది. ప్రతి సోమవారం గుర్తు చేసుకునే జ్ఞాపకాలలో అమీర్‌పేటకు ప్రత్యేక స్థానం ఉంది. అమీర్‌పేట కథ ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో మొదలవుతుంది. అప్పటి హైదరాబాద్ ఆరవ నిజాం మహబూబ్ అలీ ఖాన్ ఈ భూమిని తన జాగీర్దార్ అమీర్ అలీకి బహూకరించారు. అప్పట్లో పచ్చటి చెట్ల మధ్య, నీటి వనరులతో నిండిన ప్రశాంత ప్రాంతంగా ఉన్న అమీర్‌పేటలో ఒక చిన్న రాజప్రాసాదం నిర్మించబడింది. అదే నేడు నేచర్ క్యూర్ ఆసుపత్రిగా గుర్తింపును పొందుతూ, అమీర్‌పేట ఆవిర్భావానికి నిశ్శబ్ద సాక్ష్యంగా నిలుస్తోంది. కాలక్రమేణా అమీర్‌పేట కేవలం చరిత్రకే పరిమితం కాలేదు. ఇది అనేకమంది జీవితాలకు ఆరంభ బిందువుగా మారింది. చదువుకోసం వచ్చిన విద్యార్థులు, ఉద్యోగాల కోసం అడుగుపెట్టిన యువత, కలలతో నగరానికి వచ్చిన అన్వేషకులు అందరి కథలూ ఇక్కడే మొదలయ్యాయి.

3 కర్నూల్ న్యూస్
మంగళవారం
23 - 12 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## గౌరు చరితా రెడ్డికి అభినందనల వెల్లువ






మనగళం, కర్నూలు సిటీ : నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. టీడీపీ అధ్యక్షురాలు హోదాలో సోమవారం స్థానికి టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆమెకు ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ తదితర నాయకులు స్వాగతం పలికారు. ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయం నందు టీడీపీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానని, పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చెసిన కేక్ ను గౌరు చరితా రెడ్డి కట్ చేశారు. ఒకరి ఒకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు.

## కాటాల తనిఖీ



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీమతి జయలక్ష్మి పర్యవేక్షక సిబ్బందితో కలిసి కాటాలను తనిఖీ చేశారు. రైతులు కాటాలు జరుగు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా వ్యత్యాసం ఉన్న ఎడల కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే పర్యవేక్షక సిబ్బంది ప్రతిరోజూ కాటాలు తనిఖీ చేయాలని ఆదేశించారు.

## గురువులు సమాజ నిర్మాతలు

మనగళం, కర్నూలు సిటీ : గురువులు సమాజ నిర్మాతలు అని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ బ్రహ్మానంద చారి పేర్కొన్నారు. బనగానపల్లె మండలం చెరువు పల్లె గ్రామంలోని శ్రీ సాయి విద్యా మందిర్ కరస్పాండెంట్ వేణుగోపాల్ ను సోమవారం ఘనంగా సన్మానించారు. బ్రహ్మానంద చారి మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాల నుంచి విద్యార్థుల విద్యాభివృద్ధికి వేణుగోపాల్ చేస్తున్న కృషి అద్భుతం అని కొనియాడారు. సన్మాన గ్రహీత వేణుగోపాల్ విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు బ్రహ్మానందచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, భాను ప్రకాష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు అల్పాహారం అందించాలి

మనగళం, కర్నూలు సిటీ : పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న అదనపు తరగతుల వల్ల విద్యార్థులు తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని, అల్పాహారం తప్పనిసరిగా అందించాని కోరుతూ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ సిరికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు ఉదయం అల్పాహారం లేకుండానే పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల శ్రేయస్సు, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయండి

**– నగరపాలక ఇంచార్జీ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ (ఎఫ్ఏసీ) ఆర్‌జివి కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 17 అర్జీలను స్వీకరించిన ఇంచార్జీ కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, డిసిపి బి.వెంకటరమణ, ఎంఈ మనోహర్, ఆర్ఓ జునైద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగినులకు నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న శిశు గృహ, పెద్దపాడు, పత్తికొండ ప్రభుత్వ బాలసదనాలలో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్, ఆయా, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఎడ్యుకేటర్, యోగా/ పి ఈ టి,వంటమనిషి, హెల్పర్/నైట్ వాచ్మెన్ ఉద్యోగాలకు ఎంపిక చేసిన అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సోమవారం సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉద్యోగులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విధులు అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. ప్రత్యేకించి శిశు గృహ, ప్రభుత్వ బాలసదనాలలో ఉన్న పిల్లల్ని తమ పిల్లలుగా భావించాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్ పీడీసీఎల్) ఆధ్వర్యంలో "కరెంటోళ్ల జనబాట"కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఏపీఎస్ పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "కరెంటోళ్ల జనబాట" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్దేశిత గ్రామాలు, పట్టణ వార్డులను సందర్శించి అక్కడి విద్యుత్ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 11 కెవి, ఎల్టీ, వ్యవసాయ విద్యుత్ లైన్లను పరిశీలించి కిందకు వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని, వాలిపోయిన లేదా ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి మార్పు చేయాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ దిమ్మెల ఎత్తును పెంచడం లేదా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ 89777 16661, అలాగే ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్.ఈ 7382614308 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా 1800 425 155333, వాట్సాప్ నంబర్ 91333 31912 ద్వారా కూడా సమస్యలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, ఏపీఎస్ పీడీసీఎల్ ఎస్.ఈ. ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతపై అవగాహన సదస్సు



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం కర్నూలు న్యాయ సేవ సదన్ లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కార్పొరేట్ ఆర్గనైజేషన్ అధికారులు, ఇండస్ట్రీ, ఫ్యాక్టరీ యజమానులు, బ్యాంకర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ సీయస్ఆర్ నిధులు అంటే కంపెనీలు తమ లాభాలలో కొంత భాగాన్ని సమాజం, పర్యావరణము, ఆర్థిక అభివృద్ధి కోసం కేటాయించే మొత్తం అని తెలిపారు. భారత దేశంలో కంపెనీల చట్టం 2013 ప్రకారం విద్యా, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం వంటి రంగాలలో సామాజిక కార్యక్రమాలకు నిధులు సమకూర్చడం అని తెలిపారు. లీగల్ సర్వీసెస్ సంస్థ చేసే సేవా కార్యక్రమాలలో విభిన్న ప్రతిభావంతులకు, మానసిక వికలాంగులు, పేద పిల్లల సహాయార్థం వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు మీ వంతు సహాయం చేయాలనీ కోరారు. వికలాంగుల కోసం వీల్ చైర్లు, చెవిటి పిల్లల కోసం మిషనులను సరఫరా చేయవలసిందిగా కోరారు. కార్పొరేట్ అధికారులు సైతం లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవా కార్యక్రమాలకు తమకు వీలైనంత ఆర్థిక సహాయం అందిస్తా మని తెలిపారు. ఈ సదస్సులో ఆల్కలీస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ మేనేజర్లు, ఇండియన్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్స్, సిమెంట్ ఫ్యాక్టరీలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లాగా సాధన ఉద్యమానికి సంఘీభావం




మనగళం, కర్నూలు సిటీ : ఆదోని ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్ పై మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఒక రోజు నిహారదీక్ష స్పష్టంగా గళం విప్పారు. ఆదోని జిల్లా కావాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని, అభివృద్ధి, పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఆదోని జిల్లాగా మారాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆదోని జిల్లా డిమాండ్ పూర్తిగా న్యాయసమ్మతమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆదోని జిల్లాగా చేయాలనే ఉద్యమానికి తమ పూర్తి సంఘీభావం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడితేనే ఆదోని జిల్లా సాధ్యమవుతుందని, ఈ ఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఎస్.వి. మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# బాల్య వివాహాల అనర్ధాలపై అవగాహన సదస్సు

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి బి .లీల వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు సోమవారం వెంకటరమణ కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో బాల్య వివాహాల అనర్ధాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వందరోజుల బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయాధికారిక సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ సభ్యులు లయన్స్ జిల్లా గవర్నర్ అడ్వైజర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. 8, 9 10వ తరగతి విద్యార్థులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుగుణమ్మ, విజయమ్మ ఎస్. ముంతాజ్ బేగం, మహాలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు మురారి శంకరప్ప, రిటైర్డ్ తహసీల్దార్ తిరుపతి సాయి తదితరులు పాల్గొన్నారు.



# స్టేట్ అంతర్ కళాశాల పోటీల్లో కేఎంసి విద్యార్థుల హవా

మనగళం, కర్నూలు సిటీ : డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ నిర్వహించవహించిన 27వ మెడికల్, డెంటల్ అంతర్ కళాశాల ఆటల పోటీల్లో కర్నూల్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు హవా చాటారు. బాల్ బ్యాట్మెంటన్ టీం ఫైనల్ కి చేరుకొని విన్నెర్స్ గా నిలిచి మొదటి స్థానం కైవసం చేసుకుంది. అదేవిధంగా కబడ్డీ టీం మూడో స్థానం సాధించడం, ఇటీవలే ఫుట్ బాల్ టీం రెండో స్థానం సాధించడంపై విద్యార్థులను అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసమ్మ అభినందించారు. కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు వైద్య విద్య లోనే కాక ఆటల పోటీలలో కూడా విజయాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ అటల పోటీలో బాల్ బ్యాట్మెంటన్ 17 జట్లు పాల్గొనగా కర్నూల్ వైద్యాకళాశాల జట్టు విన్నెర్స్ గా ఒకటవ స్థానం లో నిలిచింది. రెండవ స్థానంలో సిద్దార్థ మెడికల్ కాలేజీ విజయవాడ రన్నర్స్ గా నిలిచింది. ఆ తర్వాత జరిగిన కబడ్డీ పోటీలో 23 జట్లు పాల్గొనగా కర్నూల్ వైద్యాకళాశాల జట్టు సెమీ ఫైనల్ చేరుకొని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ శ్రీకాకుళం జట్టు పై మూడవ స్థానం లో నిలిచింది. ఈ పోటీలు ఈ నెల 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు జీఎస్ఎల్ రాజమండ్రి మెడికల్ కాలేజీ నందు నిర్వహించారు. బాల్ బ్యాట్మెంటన్ కెప్టెన్ గా బి మహీధర్ రెడ్డి, కబడ్డీ టీం కెప్టెన్ సిహెచ్ దినేష్ వ్యవహారించారు. మెడికల్ కాలేజీ స్పోర్ట్స్



పోర్టు కమిటీ ఛైర్మెన్ విద్యాసాగర్, డాక్టర్ విజయబాబు డాక్టర్ విజయ శంకర్, డాక్టర్ ప్రవీణ, ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణలను ప్రిన్సిపల్ అభినందించారు.

# మండల స్థాయి ప్రతి అర్జీని రిజిస్ట్రేషన్ చేయాలి

– ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి – వేసవిలో ఎక్కడా నీటి సమస్య రాకూడదు – కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పిజిఆర్ఎస్ కు సంబంధించి మండల స్థాయిలో వచ్చిన ప్రతి అర్జీని రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తహసీల్దార్లు, ఎంపిడిఓ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, హౌసింగ్, తాగునీరు తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గత సోమవారం మండల స్థాయిలో రిజిస్ట్రేషన్ లు పూర్తిగా తక్కువ ఉండడంతో అర్జీలను ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని కలెక్టర్ సంబంధిత తహసీల్దార్ లను ప్రశ్నించారు. మండల స్థాయిలో పిజిఆర్ఎస్ లో వచ్చిన ప్రతి అర్జీ ని ఆన్లైన్ లో నమోదు చేసి అర్జిదారుడికి ఖచ్చితంగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఆయా మండలాలకు సంబంధించి కలెక్టరేట్ లో వచ్చే అర్జీల కంటే, మండలాల్లో తక్కువ నమోదు కావాలన్నారు. కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఎక్కువ అర్జీలు పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే గోనెగండ్ల, సి. బెళగల్, ఓర్వకల్లు మండలాల్లో సర్వే కు సంబంధించిన అర్జీలు ఎక్కువ పెండింగ్ ఉన్నాయని, వాటిని గడువు లోపు పరిష్కరించాలని సర్వేయర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి నోటీసులు ఇచ్చే సమయంలో ఫొటో తీసుకోవాలని, అలాగే క్షేత్ర స్థాయిలో సర్వే చేసే సమయంలో, సర్వే పూర్తయి సర్టిఫికేట్ ఇచ్చే సమయంలో అర్జీదారుని తో కలిసి ఫొటో తీసుకుని ఆధారాలను ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మార్చి 19వ తేది నాటికి జిల్లా వ్యాప్తంగా 14 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, కానీ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి ఏ మాత్రం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగు నీటి సమస్య రాకూడదని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.




నీటి పథకాలు, ఇతర నీటి వనరులకు మరమ్మతులను త్వరితగతిన చేయించాలన్నారు. 'హనుమాన్' ప్రాజెక్ట్ లో భాగంగా కోతుల బెడద నివారించడంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ లు, డిపిఓ లు అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, కోతులను అటవీ ప్రాంతంలో వదిలివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ ఏ విధంగా జరుగుతతోందని కలెక్టర్ కర్నూలు, ఆదోని, గూడూరు, ఎమ్మిగనూరు, డిపిఓ లను ఆరా తీశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రా రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , డి పి ఓ భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల వరం సీఎంఆర్ఎఫ్..మంత్రి బీసీ



మన గళం బనగానపల్లె నిరుపేదల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి మారిందని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం అన్నారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం 25 మంది లబ్ధిదారులకు గాను ఎనిమిది లక్షల 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చెక్కు రూపంలో మంత్రి పంపిణీ చేయడం జరిగింది. చెక్కుల పంపిణీ అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత భరోసానిస్తోందన్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం అప్పుల వలలో చిక్కుకోకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందన్నారు.చెక్కుల పంపిణీ సందర్భంగా వైద్య సహాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వారి యోగ క్షేమాలను మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, మంత్రికి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గజల్ శ్రీనివాస్ నిర్వహణలో జనవరి 3,4,5 తేదీలలో మూడురోజులపాటు అమరావతిలో జరుగుతున్న ప్రపంచ తెలుగుమహాసభలు పోస్టర్ ను సోమవారం కవులు, నాయకులు ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభలలో కవులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. తెలుగు భాష గౌరవాన్ని, అస్తిత్వాన్ని, గొప్పతనాన్ని కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలకు తెలుగు మాధుర్యాన్ని అందించాలని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు నక్కలమిట్టా శ్రీనివాసులు, ప్రముఖరచయిత ఇనాయితుల్ల, ప్రముఖ చారిత్రిక నవలా రచయిత అజీజ్, ప్రజాగాయకులు బసవరాజ్, గజల్ గాయకులు మహమ్మద్ మియా, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

– ఫైళ్ల నిర్వహణ పూర్తిగా ఈఆఫీస్ ద్వారానే జరగాలి
– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శాఖకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణ పూర్తిగా ఈఆఫీస్ విధానంలోనే జరగాలని, ఫిజికల్ ఫైళ్లను అనుమతించమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా శాఖలకు సంబంధించి కింది స్థాయి అధికారుల వరకు ఈఆఫీస్ విధానంలోనే ఫైళ్లను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కు సంబంధించి ఆయా శాఖలకు సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల నుండి సానుకూల స్పందన ఉండాలన్నారు. ముఖ్యంగా



పెన్షన్లు, దీపం, పారిశుద్ధ్యం, అన్న క్యాంటీన్లు, వైద్య ఆరోగ్యం తదితర శాఖలపై ప్రజల నుండి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో సీఎం చంద్రబాబునాయుడు జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే



అవకాశాలు ఉన్న నేపథ్యంలో, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు సంబంధించి కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రజల పక్షాన జీవితం అంకితం గడ్డం వెంకటస్వామి (కాకా) స్ఫూర్తి, వారసత్వం

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి కార్మిక నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) వర్ధంతి నేడు కేవలం ఒక స్మరణ దినంగా మాత్రమే కాకుండా, ప్రజల పక్షాన నిలిచిన రాజకీయ జీవనాన్ని తిరిగి ఆలోచించుకునే సందర్భంగా నిలుస్తోంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న రోజుల నుంచే ఆయనలో ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడింది. రాజకీయ స్వేచ్ఛ ఒక్కటే సరిపోదు, ప్రజలకు సామాజిక, ఆర్థిక స్వేచ్ఛలు కూడా లభించాలి అన్న ఆలోచన ఆయనను జీవితాంతం నడిపించింది. అందుకే స్వాతంత్ర్యానంతరం కూడా ఆయన పోరాటం ఆగలేదు; అది ప్రజల సమస్యల వైపు మళ్లింది.సింగరేణి గనుల్లో పనిచేసే కార్మికుల జీవితాలు గడ్డం వెంకటస్వామి రాజకీయ జీవనానికి కేంద్రంగా మారాయి. భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పని చేసే కార్మికుల భద్రత, వేతనాలు, హక్కులు, గౌరవప్రదమైన జీవనం కోసం ఆయన చేసిన పోరాటాలు తెలంగాణ కార్మిక చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయి. కార్మిక ఉద్యమం అంటే కేవలం నినాదాలు కాదు, అది జీవన సమస్యలపై సాగిన పోరాటం కావాలని ఆయన నిరూపించారు. వ్యవస్థ ఎంత శక్తివంతంగా ఉన్నా, కార్మికుల తరపున నిలబడి మాట్లాడే నైతిక ధైర్యం ఆయన నాయకత్వానికి మూలబలం.తెలంగాణ ఉద్యమంలో గడ్డం వెంకటస్వామి పాత్రను అర్థం చేసుకోవాలంటే, ఆయన ఆలోచనలను చూడాలి. ప్రాంతీయ అసమానతలు, వనరుల దోపిడీ, అభివృద్ధిలో జరిగిన అన్యాయం వంటి అంశాలను ఆయన చాలా ముందుగానే గుర్తించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడటం అంటే భావోద్వేగాలకే పరిమితం కాకుండా, విధానపరమైన మార్పుల కోసం పోరాడాలని ఆయన నమ్మారు. అందుకే తెలంగాణ సమస్యలను జాతీయ రాజకీయాల్లో ప్రస్తావించి, కేంద్ర స్థాయిలో చర్చకు తీసుకెళ్లిన నేతగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ, గడ్డం వెంకటస్వామి రాజకీయ శైలి మారలేదు. పదవులు వచ్చాయి, వెళ్లాయి; కానీ ఆయన ప్రజలతో ఉన్న అనుబంధం మాత్రం అలాగే కొనసాగింది. అధికారం కోసం రాజకీయాలు చేయడం కంటే, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన లక్ష్యంగా ఆయన రాజకీయాన్ని చూశారు. ఆయన ఇంటి తలుపులు ఎప్పుడూ ప్రజలకు తెరిచి ఉండేవని, సమస్యలతో వచ్చిన వారిని వినకుండా పంపలేదని సమకాలీనులు గుర్తుచేసుకుంటారు.నేటి రాజకీయ పరిస్థితుల్లో గడ్డం వెంకటస్వామి స్ఫూర్తి మరింత అవసరంగా కనిపిస్తోంది. ప్రజల సమస్యలకన్నా అధికార లెక్కలు ముందుకు వచ్చే కాలంలో, ప్రజల కోసం నిలబడే రాజకీయాలు కూడా సాధ్యమేనని ఆయన జీవితం చెబుతోంది. కార్మికులు, రైతులు, పేదలు వీరే రాజకీయాల కేంద్రంగా ఉండాలన్న ఆయన ఆలోచన నేటికీ ప్రాసంగికమే. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడమే నిజమైన విజయమని ఆయన రాజకీయ జీవితం నిరూపించింది.ఈ రోజు ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గడ్డం వెంకటస్వామికి నివాళులర్పించడం ఒక రాజకీయ ఆచారంగా మాత్రమే కాకుండా, ఆ మహనీయుడి ఆలోచనలను గుర్తుచేసే సంకేతంగా నిలుస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, కార్మిక నాయకత్వంగా విస్తరించి, తెలంగాణ ఆత్మగౌరవానికి స్వరంగా మారింది. గడ్డం వెంకటస్వామి (కాకా) స్ఫూర్తి ప్రజల పక్షాన నిలబడే రాజకీయాలకు నేటికీ ఒక నైతిక దిక్సూచి.స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి కార్మిక నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) వర్ధంతి నేడు కేవలం ఒక స్మరణ దినంగా మాత్రమే కాకుండా, ప్రజల పక్షాన నిలిచిన రాజకీయ జీవనాన్ని తిరిగి ఆలోచించుకునే సందర్భంగా నిలుస్తోంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న రోజుల నుంచే ఆయనలో ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడింది. రాజకీయ స్వేచ్ఛ ఒక్కటే సరిపోదు, ప్రజలకు సామాజిక, ఆర్థిక స్వేచ్ఛలు కూడా లభించాలి అన్న ఆలోచన ఆయనను జీవితాంతం నడిపించింది. అందుకే స్వాతంత్ర్యానంతరం కూడా ఆయన పోరాటం ఆగలేదు; అది ప్రజల సమస్యల వైపు మళ్లింది.సింగరేణి గనుల్లో పనిచేసే కార్మికుల జీవితాలు గడ్డం వెంకటస్వామి రాజకీయ జీవనానికి కేంద్రంగా మారాయి. భూగర్భ గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పని చేసే కార్మికుల భద్రత, వేతనాలు, హక్కులు, గౌరవప్రదమైన జీవనం కోసం ఆయన చేసిన పోరాటాలు తెలంగాణ కార్మిక చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయి. కార్మిక ఉద్యమం అంటే కేవలం నినాదాలు కాదు, అది జీవన సమస్యలపై సాగిన పోరాటం కావాలని ఆయన నిరూపించారు. వ్యవస్థ ఎంత శక్తివంతంగా ఉన్నా, కార్మికుల తరపున నిలబడి మాట్లాడే నైతిక ధైర్యం ఆయన నాయకత్వానికి మూలబలం.తెలంగాణ ఉద్యమంలో గడ్డం వెంకటస్వామి పాత్రను అర్థం చేసుకోవాలంటే, ఆయన ఆలోచనలను చూడాలి. ప్రాంతీయ అసమానతలు, వనరుల దోపిడీ, అభివృద్ధిలో జరిగిన అన్యాయం వంటి అంశాలను ఆయన చాలా ముందుగానే గుర్తించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడటం అంటే భావోద్వేగాలకే పరిమితం కాకుండా, విధానపరమైన మార్పుల కోసం పోరాడాలని ఆయన నమ్మారు. అందుకే తెలంగాణ సమస్యలను జాతీయ రాజకీయాల్లో ప్రస్తావించి, కేంద్ర స్థాయిలో చర్చకు తీసుకెళ్లిన నేతగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ, గడ్డం వెంకటస్వామి రాజకీయ శైలి మారలేదు. పదవులు వచ్చాయి, వెళ్లాయి; కానీ ఆయన ప్రజలతో ఉన్న అనుబంధం మాత్రం అలాగే కొనసాగింది. అధికారం కోసం రాజకీయాలు చేయడం కంటే, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన లక్ష్యంగా ఆయన రాజకీయాన్ని చూశారు. ఆయన ఇంటి తలుపులు ఎప్పుడూ ప్రజలకు తెరిచి ఉండేవని, సమస్యలతో వచ్చిన వారిని వినకుండా పంపలేదని సమకాలీనులు గుర్తుచేసుకుంటారు.నేటి రాజకీయ పరిస్థితుల్లో గడ్డం వెంకటస్వామి స్ఫూర్తి మరింత అవసరంగా కనిపిస్తోంది. ప్రజల సమస్యలకన్నా అధికార లెక్కలు ముందుకు వచ్చే కాలంలో, ప్రజల కోసం నిలబడే రాజకీయాలు కూడా సాధ్యమేనని ఆయన జీవితం చెబుతోంది. కార్మికులు, రైతులు, పేదలు వీరే రాజకీయాల కేంద్రంగా ఉండాలన్న ఆయన ఆలోచన నేటికీ ప్రాసంగికమే. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడమే నిజమైన విజయమని ఆయన రాజకీయ జీవితం నిరూపించింది.ఈ రోజు ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గడ్డం వెంకటస్వామికి నివాళులర్పించడం ఒక రాజకీయ ఆచారంగా మాత్రమే కాకుండా, ఆ మహనీయుడి ఆలోచనలను గుర్తుచేసే సంకేతంగా నిలుస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, కార్మిక నాయకత్వంగా విస్తరించి, తెలంగాణ ఆత్మగౌరవానికి స్వరంగా మారింది. గడ్డం వెంకటస్వామి (కాకా) స్ఫూర్తి ప్రజల పక్షాన నిలబడే రాజకీయాలకు నేటికీ ఒక నైతిక దిక్సూచి.

# ఘనంగా గణిత శాస్త్ర పితామహుడి జయంతి వేడుకలు.

మన గళం బనగానపల్లె గణిత శాస్త్ర పితామహుడు అయినటువంటి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా సోమవారం బనగానపల్లె మండలంలోని యాగంటి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జయంతి సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతిమాట్లాడుతూ1887 వ సంవత్సరం డిసెంబర్ 22వ తేదీన శ్రీనివాస రామానుజన్ జన్మించడం జరిగింది. ఈయన గణిత శాస్త్రం కు సంబంధించి అనేక విషయాలు వెలుగులోనికి తీసుకువచ్చారు. గణిత శాస్త్రం కు సంబంధించి కొత్త కొత్త విషయాలు తెలియజేశారు. జయంతి సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులు గణిత శాస్త్రంలోని వివిధ రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు నూకల వెంకటసుబ్బయ్య, యూసఫ్ హుస్సేన్, నాగరాజు, మద్దిలేటి, మురళీమోహన్, హరికృష్ణ, రాజ మనోహర్ రెడ్డి, పద్మావతమ్మ, తిరుపాలమ్మ, వినీత తదితర



ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డోన్ ఉప ఖజానా కార్యాలయంలో ఏసీబీ దాడులు

**– రూ.30 వేల లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొనిఅరెస్టు చేసిన ఏసీబీ అధికారులు**

మన గళండోన్ పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పెన్షన్ బెనిఫిట్స్ మంజూరు పేరుతో లంచం డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ ఆర్. లక్ష్మణ్ నాయక్‌ను రూ.30,000 లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.డోన్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన శ్యామ్ రాజు 30-06-2025న పదవీ విరమణ చేశారు. ఆయనకు పెన్షన్ మంజూరైనప్పటికీ, పెన్షన్ బెనిఫిట్స్ విడుదల కోసం గత ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆర్. లక్ష్మణ్ నాయక్ రూ.45,000 లంచం డిమాండ్ చేయగా, చివరకు రూ.30,000 ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది.ఈ విషయంపై శ్యామ్ రాజు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతృత్వంలో పథకం రూపొందించి దాడులు చేపట్టారు. సోమవారం డోన్ ఉప ఖజానా కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఆర్. లక్ష్మణ్ నాయక్‌ను పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో డీఎస్పీ సోమన్నతో పాటు సీఐలు కృష్ణయ్య, రాజ



ప్రభాకర్, శ్రీనివాసులు తదితర ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు

# గౌరు చరితారెడ్డికి అభినందనలు

మనగళం, కల్లూరు : టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సోమవారం స్థానిక నివాసంలో గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులను రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి రామ గిడ్డయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన గౌరుచరితారెడ్డికి ఈ సందర్భంగా ఉప్పరి రామ గిడ్డయ్య అభినందనలు తెలిపారు.




అదేవిధంగా గౌరుచరితారెడ్డికి అధ్యక్షురాలి పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ కు ఉప్పరి రామ గిడ్డయ్య కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కల్లూరు మండల, పర్ల గ్రామం రెండవ బూత్ టీడీపీ ఇన్ చార్జ్ బి. శివ, నాయకులు, కార్యకర్తలు గౌరుచరితారెడ్డికి అభినందనలు తెలిపారు.

# మరణాంతరం కూడా విడవని స్నేహం



.మన గళం అవుకు స్నేహమంటే బ్రతికున్నప్పుడే కాదు మరణించిన తర్వాత కూడా ఆ స్నేహాన్ని విడిచిపెట్టకూడదని అవుకు పట్టణంలోని 2004 బి 2005 సంవత్సరం విద్యార్థులు రుజువు చేశారు. తన మిత్రుడు శనగల వెంకటేశ్వర్లు అకాల మరణం చెందడం జరిగింది. మరణం తరువాత ఆదివారం తన స్నేహితుడి చిత్రపటానికి పూలమాల నుంచి నివాళులర్పించిన అనంతరం వెంకటేష్ కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. భవిష్యత్తులో పిల్లల చదువులు విషయమై ఏ ఇతర అవసరమైన తమ బ్యాచ్ అండగా ఉంటుందని ఆ కుటుంబానికి భరోసా ఇవ్వడం జరిగింది. తమ బ్యాచ్లో ఏ ఒక్కరికి ఆపద వచ్చిన సహాయం చేయడానికి ముందుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2004 బి2005 విద్యార్థులు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ వాష్ అండ్ గో'

మనగళం, కర్నూలు క్రై : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కర్నూలు పోలీసులు వాహనాల డ్రైవర్లకు "స్టాప్ - వాష్ అండ్ గో"కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు సబ్ డివిజన్ లలోని నేషనల్ హైవేల లో లారీలు, ప్రవేట్ ట్రావెలింగ్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరో వాహనాలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకూడదని, రాంగ్ రూట్ లో వెళ్లకూడదని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదనిన పోలీసు అధికారులు ఆయా వాహనాల డ్రైవర్లకు తెలియజేస్తున్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు రద్దు చేయద్దు.సిపిఐ

మన గళం బనగానపల్లె భారత్ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్దసోమవారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. నిరసన అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రం అందించడం జరిగింది. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి ఏ.శివయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన ఆటంకాలు కలిగిస్తూ పేదలకు పట్టెడు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని రకరకాలుగా కుట్రలు పడుతుంది. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తూ వి.బి.జె.రాం అనే బిల్లును పార్లమెంట్లో ఆమోదించింది. ఈ బిల్లు వల్ల ఉపాధి కూలీలకు ఎలాంటి ఉపయోగం లేదు. వేతనాల పెంపు పని దినాల పెంపు పెరగకపోగా రోజువారి కూలి 240 రూపాయలకు తగ్గించి చట్టం తెచ్చేటప్పుడు అప్పటి యూపీఏ ప్రభుత్వం అందరి అభిప్రాయాలు తీసుకొని చట్టం తెచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడగా బిల్లు ఆమోదం చేసి మహాత్మా గాంధీ పై ఉన్న కోపాన్ని ఇలా తీర్చుకుంటుంది. పేదలకు నష్టం జరుగుతుందని కూటమి ప్రభుత్వానికి తెలుసు. కూటమిలో భాగమైన రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అడగలేక పోతుంది. దయచేసి మహాత్మా గాంధీ జాతీయ



ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించాలని, ఉపాధి హామీ కూలికి ప్రతిరోజు వారి కూలి 600 ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు జి. సంజీవులు, సిపిఐ మండల సమితి సభ్యులు ఖాదర్ ,సుబ్రహ్మణ్యం ,మహిళా సమైక్య కార్యదర్శి స్వరూప సిపిఐ కార్యకర్తలు సుబ్బయ్య, నాయక్ ప్రజలు పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల : బాల్యవివాహాలు సమాజానికి శాపమని, పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉన్నదని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హల్ కారిడార్ లో ప్రజావినతుల స్వీకరణకు ముందు జిల్లాలో బాల్యవివాహల నిర్మూలనపై వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ బాల్యవివాహల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని తెలిపారు. చట్టప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలులకు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్యవివాహల నివారణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్యవివాహల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బాల్యవివాహలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ లో ప్రజావినతుల స్వీకరణ అనంతరం 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమంపై ఆమె మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో నిర్దేశిత గ్రామాలు, పట్టణ వార్డులను సందర్శించి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరిస్తారని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అదేవిధంగా 11 కేవీ, ఎల్‌టీ, వ్యవసాయ విద్యుత్ లైన్లను కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. వాలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి మార్పు చేయడం, క్రిందకు వేలాడుతున్న వైర్లను సరిచేయడం, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ దిమ్మలను ఎత్తు పెంచడం, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం ఇవ్వడం, స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం ద్వారా (ఫోన్ నంబర్: 89777 16661) అలాగే ప్రతి సోమవారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సమస్యల నివారణకు టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155 333 లేదా వాట్సాప్ నంబర్ 91333 31912 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ఇంధనాన్ని పొదుపుగా వినియోగించి భావితరాలకు వెలుగును అందిద్దామని, ఆన్లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు సూచించారు. అనంతరం 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమ పోస్టర్ ను కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

# దరఖాస్తులను నాణ్యతతో వేగంగా పరిష్కరించాలి

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించే ప్రతి దరఖాస్తును అత్యంత నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలన్నారు. పారదర్శకతతో, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించే విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా జిల్లాలను సందర్శించి పర్యవేక్షించనున్న నేపథ్యంలో, అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. రీ-ఓపెన్ అయిన దరఖాస్తులు, బియాండ్ ఎస్-ఎల్ఏలో ఉన్న అర్జీలు, వీఐపీ గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాల పరిమితిలోగా వెంటనే క్లియర్ చేయాలని సూచించారు.పరిహారం మంజూరు చేయండి : కొలిమిగుండ్ల మండలం, పెట్నీకోట గ్రామానికి చెందిన కొప్పుల అషితు రెడ్డి గ్రామ పొలిమేరలోని సర్వే నెం.223లో ఉన్న 10.20 సెంట్ల భూమిని నీటి మునకగా నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు సంబంధించిన పరిహార నగదు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని నంద్యాల మండలం, రోజాకుంట ప్రాంతానికి చెందిన కె. సునీత జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు. ఎదురపాడు గ్రామ పొలిమేరలోని సర్వే నెం.560/2లో తనకు 4 ఎకరాల భూమి ఉందని కొత్తపల్లి మండలం, కొక్కెరంచ గ్రామానికి చెందిన ఎం. జయన్న తెలిపారు. భూమిని పరిశీలించి ఆన్లైన్‌లో నమోదు చేసి పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 276 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల : ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకున్న కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి దోహదపడేలా సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం సంబంధిత అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఐదవ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాలను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలనే దిశగా సీఎం చంద్రబాబు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. ఈ సమావేశంలో మొత్తం 118 అంశాలపై చర్చించగా, వివిధ శాఖలకు సంబంధించిన 95 అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ముఖ్యంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 2026 జనవరి 15 నాటికి వంద శాతం ఈ-ఆఫీస్ అమలు చేయాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్లైన్ ద్వారా అందించాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. అలాగే పీ4 (ప్రభుత్వప్రైవేటుప్రజల భాగస్వామ్యం) కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను గుర్తించి మార్గదర్శకులను మ్యాపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) కు సంబంధించిన అన్ని వివరాలను ప్రతి నెల 5వ తేదీలోగా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన లక్ష్యాల సాధనలో జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు జిల్లా వ్యవసాయ అధికారిని కలెక్టర్ అభినందించారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి కోసం ఐగాట్ కర్మయోగి వంటి శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే ఓపిటిఎస్ (ఆఫీస్ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ ) ద్వారా ఉద్యోగులు నిర్వర్తించిన పనితీరు ఆధారంగా ర్యాంకింగ్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల సేవలైన వాట్సాప్ గవర్నెన్స్, తప్పనిసరి బయోమెట్రిక్ హాజరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి ఇన్వెస్ట్మెంట్ ట్రాకర్, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని, కర్మాగారాల్లో పనిచేస్తున్న 20 వేల రూపాయల లోపు వేతనం పొందే ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ఓ మినహాయింపులు వర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# విద్యార్థుల్లో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు 'ముస్తాబు'

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




మనగళం, నంద్యాల : పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'ముస్తాబు' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ముస్తాబు కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమంలో భాగంగా ప్రతి తరగతి గది, వసతిగృహంలో ఒక 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్నర్‌లో అద్దం, దువ్వెన, తువ్వాలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, బకెట్ వంటి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేందుకు పరిశుభ్రంగా ఉండే విద్యార్థులను 'పరిశుభ్రత నాయకులు'గా ఎంపిక చేసి, చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత అంశాలను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. అలాగే చేతులు కడుక్కునే సరైన విధానం, గోళ్ల సంరక్షణ, జుట్టు శుభ్రత, మరుగుదొడ్డి వినియోగం వంటి అంశాలపై పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా చార్టులు, పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో రోజువారీ వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లుగా మారడమే కాకుండా, పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతున్నాయని కలెక్టర్ తెలిపారు.పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలి: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా జిల్లాలోని 281 ఉన్నత పాఠశాలలకు ఒక్కొక్క అధికారిని ఒక్కో పాఠశాలకు ప్రత్యేక అధికారి (స్పెషల్ ఆఫీసర్)గా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన పాఠశాలలను తరచుగా సందర్శిస్తూ విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం అందించి మంచి మార్కులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 202324 సంవత్సరంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో 19వ స్థానంలో, 2024లో 17వ స్థానంలో నిలిచిందని, ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను టాప్10లో నిలబెట్టేలా అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# పదవ తరగతి పరీక్షలలో 100% పాస్ అవటానికి వందరోజుల కార్యాచరణ





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోడుమూరు ఎంపీడీవో రాముడు సోమవారం ఉదయం జిల్లా పరిషత్ హై స్కూల్ బాయ్స్ కోడుమూరు జివిఆర్ జడ్పిహెచ్ఎస్ కోడుమూరు నందు అడాప్షన్ ఆఫీసర్గా పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో వారి యొక్క ప్రగతి నివేదికలు పెర్ఫార్మెన్స్ గురించి పిల్లలతో మాట్లాడి ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు అదే విధంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతున్నటువంటి రెమిడీల్ క్లాసెస్ సక్రమంగా జరుగుతున్నాయా ఆ క్లాసెస్ కు పిల్లలు హాజరు అవుతున్నారా హాజరు శాతం ఎలా ఉంది వారు రాబోయే పదవ తరగతి పరీక్షలలో 100% పాస్ అవటానికి వందరోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయటానికి పాఠశాలలో పనిచేసేటువంటి ఉపాధ్యాయులతో చర్చించి 125 మంది పిల్లలు టెన్త్ క్లాస్ వారు ఉన్నారు వారందరూ కూడా 100% పాస్ అవ్వటానికి కృషి చేయడానికి టీచర్స్ తో కలిసి చర్చించారు అలాగే విద్యార్థులకు తగిన సూచనలు వారు అందించారు ఈ కార్యక్రమంలో స్థానిక టీచర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# రచ్చబండ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి తగిన పరిష్కారాలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన పిజిఆర్ఎస్ మరియు రచ్చబండ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, త్రాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన సమస్యలను శ్రద్ధగా విన్నారు.ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు సమానంగా చేపడతామని తెలిపారు.

# మైనార్టీ బాలికల విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో, డోన్ పట్టణంలోని ఉమర్ బిన్ ఖాతాబ్ మస్జిద్ సమీపంలో ఈ నెల 27వ తేదీన బాలికల కోసం నిర్వహించనున్న మద్రసా ఫౌండేషన్ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సహకారం ఎంతో ప్రోత్సాహకరమని తెలిపారు. ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, మైనారిటీ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# ద్రోణాచలం సేవాసమితి ఆధ్వర్యంలో 127వ ఆత్మబంధు అంత్యక్రియలు

మన గళండోన్ పట్టణ సమీపంలో రైల్వే స్టేషన్ దగ్గర నిన్న చనిపోయిన యాచకుడు పుల్లయ్య అనే వ్యక్తి చనిపోయాడు తన దగ్గర ఎటువంటి ఆధార్ కార్డు గాని తనకు సంబంధించిన గుర్తింపు పేపర్లు గాని లేనందువలన తను ఒక అనాధ యాచకుడు అని గుర్తించి మృతదేహానికి అంత్యక్రియలు చేయమని డోన్ టౌన్ పోలీసు వారు ద్రోణాచలం సేవాసమితి వారికి కోరగా చనిపోయిన వ్యక్తి గురించి టౌన్ సి.ఐ ఇంతియాజ్ కి తెలిపి చనిపోయిన యాచకుడికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో డోన్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది ఈ పుణ్య కార్యక్రమమునకు అయిన ఖర్చు మొత్తం లి రైల్వే ఎంప్లాయ్ నరేష్ కుమార్ స్వామి లి భరించారు. ఈ కార్యక్రమం లో ద్రోణాచలం సేవా సైనికులు ఆత్మబంధు టీం సభ్యులు గురుస్వామి సయ్యద్ వలి మెకానిక్ వెంకటేష్ మరియు డోన్ టౌన్ కానిస్టేబుల్ భాస్కర్. రామాంజనేయులు పాల్గొన్నారు .





# విద్యార్థులు గణితం పైన మక్కువ పెంచుకుంటే గణితం చాలా ఈజీ





( ఆలూరు మనగళం ):హాలహర్వి మండలం, విరుపాపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గారి జయంతిని పురస్కరించుకొని, ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన రామానుజన్ చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళు లర్పించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్తలు ఆర్యభట్ట, భాస్కరాచార్య, ఐజాక్ న్యూటన్, ఆర్కిమెడిస్, యూక్లిడ్, పైథాగరస్, శాకుంతలాదేవి లాంటి వారు తెలిపిన సూత్రాలను, ఫార్ములాలను, సమీకరణాలను, గణాంకాలను, అనుసరించి నేడు గణితం చేయడం జరుగుతుంది. దాని వల్ల విద్యార్థులకు నిత్యజీవితంలో అనేక సమస్యల్ని పరిష్కరించుకోవడానికి వీలవుతుందన్నారు. సమస్యా పరిష్కారానికి గణిత ఉపాధ్యాయులు చేయూత నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన గణిత ప్రక్రియలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయ, గాదిలింగప్ప, ధనలక్ష్మి, హరిత, హిమశైలజ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ ను కలిసిన రాఘవేంద్ర రెడ్డి



మనగళం, మంత్రాలయం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసం లో మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి లోకేష్ కు ఆయన శాలువా కప్పి సత్కరించారు. మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాఘవేంద్ర రెడ్డి కోరారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మంత్రి లోకేష్ కు వివరించగా సానుకూలంగా స్పందించారని మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి తెలిపారు.

## సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి



మనగళం, ప్యాపిలి : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభల పోస్టర్లను గ్రామ పంచాయతీ ఆవరణములో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్యాపిలి మండలం ప్రధాన కార్యదర్శి ఎస్ ఏ చిన్న రహిమాన్, అధ్యక్షులు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు నెట్టికల్లు, ఇలియాజ్ మాట్లాడారు. గత మూడు సంవత్సరాల కాలంలో పోరాటాలను సమీక్షించుకొని రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సమాయత్తం అయ్యేందుకు నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, రవి, ఖాదర్, హనుమంతు, రాఘవేంద్ర, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



మనగళం, ఆదోని : ఆదోని మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోని మెడికల్ కాలేజీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం, బహుజన్ సమాజ్ పార్టీ, విద్యార్థి సంఘాలు బీడీఎస్ఎఫ్, పీడీఎస్ యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్, పీడీఎస్ఓ నాయకులు, కార్యకర్తలు మెడికల్ కాలేజ్ ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోర్సీ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్లలో జోరు.. 600 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్

హైదరాబాద్ డిసెంబర్ 22, 2025 మన గళం : గత వారం భారీ నష్టాలతో కుదేలైన దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం లాభాలతో బలమైన ఆరంభం చేశాయి. 2026లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు మదుపర్లలో విశ్వాసాన్ని పెంచాయి. దీనికి తోడు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగటం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు సూచీలను ముందుకు నడిపించాయి. గత సెషన్‌లో విదేశీ మదుపర్లు దాదాపు 1800 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొనుగోలు చేయడం కూడా మార్కెట్‌కు బలం చేకూర్చింది.గత ముగింపు 84929తో పోలిస్తే సెన్సెక్స్ సోమవారం ఉదయం 150 పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్ల ఊపుతో మరింత బలపడింది. చివరకు సెన్సెక్స్ 638 పాయింట్లు పెరిగి 85567 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ కూడా అదే దిశలో కదిలి 206 పాయింట్ల లాభంతో 26172 వద్ద స్థిరపడింది. దీంతో నిఫ్టీ మళ్లీ 26000 మార్క్‌ను దాటింది.సెన్సెక్స్‌లో సోలార్ ఇండస్ట్రీస్, మాజగాన్ డాక్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, నాల్కో, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. డిక్సన్ టెక్నాలజీస్, చోలా ఇన్వెస్ట్, సమ్మన్ క్యాపిటల్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, హీరో మోటోకార్ప్ షేర్లు మాత్రం నష్టాలను ఎదుర్కొన్నాయి. బ్యాంక్ నిఫ్టీ 234 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 505 పాయింట్లు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 89.65 వద్ద కొనసాగుతోంది

## శ్రీనివాస రామానుజన్ జయంతి



మన గళం కోడుమూరు: శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని జి వి ఆర్ ఉన్నత పాఠశాల కోడుమూరు నందు మాథ్స్ డే ను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అయినటువంటి రాజరాజేశ్వరి మరియు ఆదాం షఫీ ఉస్మాన్ అరుణ మరియు లక్ష్మీదేవి రత్న నాయక్, కృష్ణమూర్తి, అనిత సురేంద్ర నాయుడు ఇతర ఉపాధ్యాయ లు పాల్గొనడం జరిగింది.

## దొంగిలించిన సొత్తు రికవరీ ఒక నిందితుడు అరెస్టు, మరొకరు పరారీ



మన గళం కోడుమూరు: ముడుమలగుర్తి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ తబ్రేజ్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ముడుమలగుర్తి గ్రామానికి చెందిన కురువ నాగేంద్ర సుమారు నాలుగు సంవత్సరముల క్రిందట పత్తికొండ మండలము హోసూరు గ్రామమునకు చెందిన కవిత అను ఆమెను వివాహం చేసుకొని వారి ఇద్దరి భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాల్లో మనస్పర్థలు రావడం వలన ఇప్పటికి సుమారు ఒక సంవత్సరం క్రిందట అతని భార్య వదిలి పుట్టింటికి వెళ్లడం వల్ల అతడు అల్లరి చిల్లరగా తిరుగుతూ ఉండగా, గత మూడు నెలల క్రిందట గొర్రెలు మేపే చోట గోరంట్ల గ్రామమునకు చెందిన బోయ ఎల్లప్ప కురువ నాగేంద్రకు పరిచయం అయ్యారు. ఇరువురు జల్సాలకు అలవాటు పడి ఇండ్లలో దొంగతనం చేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో తాళము వేసిన ఇండ్లను కనిపెట్టుకుంటూ ఉండి, గోరంట్ల గ్రామమునకు చెందిన రాము అనునతడు తన భార్య పిల్లలతో పాటు దర్శనం కొరకు మహానందికి పోగా అది గమనించిన బోయ ఎల్లప్ప ఈ విషయము నాగేంద్రకు చెప్పగా, ఇరువురు 27 వ నవంబర్ నెలలో మధ్యాహ్నము 12.30 గంటలకు గోరంట్ల గ్రామములో రాము యొక్క ఇంటి తాళం పగలగొట్టి అందులో ఉన్న రెండు జతల బంగారు కమ్మలు, ఒక బంగారు చిన్న కమ్మలు, ఒక జత వెండి కాళ్ళ పట్టీలు, రూ.80,000/- నగదు దొంగిలించారు. ముడుమలగుర్తి గ్రామమునకు చెందిన మల్లికార్జున రెడ్డి కి ఆరోగ్యము సరిగా లెందున అతని భార్య అతని కొడుకు అతన్ని చికిత్స కొరకు కర్నూలుకు హాస్పిటల్ తీసుకొని వెళ్లి, ఇంటికి తాళం వేసి వెళ్ళగా, అది గమనించిన కుర్వ నాగేంద్ర ఈ నెల 15వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో మల్లికార్జున రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలోనికి వెళ్లి ఇంటిలో బెడ్ రూమ్ లో ఉన్న బీరువా తాళమును పగలగొట్టి అందులో ఉన్న ఒక బంగారు తాళిబొట్టు చైను, ఒక జత బుట్ట కమ్మలు , చెంప చారాలు, ఒక జత రాళ్ల కమ్మలు రెండు జతల కాళ్ల పట్టీలు, ఒక వెండి మొలతాడు దొంగిలించారు. దొంగలించిన పై రెండు కేసుల మొత్తము సొమ్ము విలువ రూ.6,13,000/- ఉంటుంది. వారు ఇద్దరూ ఈ దొంగిలించిన సొత్తును తీసుకొని బెంగళూరు వెళ్లి జల్సాలు చేయాలనే ఉద్దేశ్యంతో సోమవారము కురవ నాగేంద్ర తన పొలములో దాసిపెట్టినా ఈ యొక్క సొత్తును తీసుకొని కోడుమూరు టౌన్ లోని తాత గుడి దగ్గరికి వచ్చి, ఎల్లప్పకు మందు తీసుకొని రమ్మని చెప్పి అతని కొరకు వేచియుండగా అక్కడ అంతలో పోలీసు వారు కురువ నాగేంద్ర ను అరెస్టు చేశారు. యెల్లప్ప పరారీలో ఉన్నాడు.

## ఈ. ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ లో శిక్షణ కార్యక్రమం



మన గళం కోడుమూరు: మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి అభ్యున్నతికి ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ కృషి చేస్తుందని ఈ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్తేరు రాణి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించానే లక్ష్యంతో ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్లో ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమాన్ని ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ టి ఎస్తేరు రాణి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశం ఉందని ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం కోడుమూరు పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీ, బీసీ కాలనీ, కృష్ణాపురం గ్రామం, ఎర్రబాడు గ్రామం వరకు గ్రామ ప్రాంతాల్లో కూడా టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కల్పించేలా సహకారం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ. ఆర్. ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా వృద్ధాశ్రమం నిర్వహించుట, అనాథ ఆశ్రమం ,బ్లడ్ డొనేషన్ క్యాంప్స్, ఉచిత మెడికల్ క్యాంపు, నిరుద్యోగులకు కమ్యూనికేషన్ స్కిల్స్, కుటీర పరిశ్రమల నిర్వాహణకు అవగాహన కల్పించడం, మహిళలకు ఉపాధి కొరకు కుట్టు మిషన్ టైలరింగ్ నేర్పుట, అనాథ మరియు పేద పిల్లలకు విద్యను అందించుట, పేదలకు బట్టలు, ఆహారం అందించడం ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ అధ్యక్షులు గేరా షారోన్, సంపూర్ణ రావు, వీర రత్నరాజు, సువార్తమ్మ, ఎస్తేరు రాణి కర్నూలు జిల్లా అధ్యక్షులు, కే. సల్మాన్ రాజు మండల అధ్యక్షురాలు, కే. జీవనజ్యోతి, కే .సత్యనారాయణ వార్డ్ మెంబర్ షఫీ, ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించం





మన గళం కోడుమూరు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్పుతో నిర్వీర్యం చేయాలని చూస్తే సహించమని వామపక్ష పార్టీలు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కోట్ల సర్కిల్లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని, వికసిత్ భరత్ జి రామ్ జి పేరును తొలగించాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు గఫూర్మియా అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కార్యదర్శి కామర్తి రాజు, సిపిఐ మండల కార్యదర్శి రాజు లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేకతకు పాల్పడుతుందని వారు విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును తొలగించి వికసిత్ ద్భారత్ జి రాంజీ పేరుతో ఈ పథకాన్ని ఎత్తివేయడానికి ప్రధాని మోదీ దుష్ట పన్నాగాలు పన్నుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంగ్లెయుల పాలన నుంచి భారతదేశాన్ని స్వాతంత్ర్య ఉద్యమం దిశగా నడిపించిన పూజ్య బాపూజీ పేరు ప్రపంచమంతటా మారుమోగితే ఈ బిజెపి ప్రభుత్వానికి మహాత్మా గాంధీ పేరు నచ్చడం లేదని, హిందుత్వ వాదంతో జి రాంజీ పేరు పెడుతోందని పేరు మార్పుతో ఏమి వొరుగబెడతారోనని వారు ద్వజమెత్తారు. అనంతరం, సిపిఐ పట్టణ కార్యదర్శి, బి.కె.యం యు నియోజకవర్గ కార్యదర్శి శేష్ కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి ఈరన్న లు మాట్లాడుతూ 2004 లో కాంగ్రెస్ పార్టీ వామపక్ష పార్టీ లను కలుపుకొని యూపీఏ వన్ ప్రభుత్వ ం ఏర్పాటు చేయగా ఆ సమయంలో వామపక్ష పార్టీలకు చెందిన 62 మంది పార్లమెంటు సభ్యులు వున్నారని అన్నారు. అందులో సిపిఐ ప్రభుత్వం లో చేరగా వారికి కేంద్ర హోం శాఖ మంత్రి గా ఇంద్రజిత్ గుప్తా,కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా చతురశ్రా మీనన్ భాద్యతలు స్వీకరించారు. అంతకుమునుపే పనులులేక, ఉద్యోగాలు లేక అల్లాడుతున్న, పస్థులుంటున్న దేశప్రజలను కలుపుకొని పనైనా చూపండి - లేదంటే జైల్లోనైనా పెట్టండి అని వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. వామపక్ష పార్టీలతో అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీని ఒప్పించి దేశంలోని ప్రజలకు పని కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకురావడం జరిగిందన్నారు. 4,165,000 కోట్లతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కేటాయించగా, నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని ఉద్దేశంతోనే తూతూ మంత్రంగా నిధుల విడుదల చేయడం, పేరు మార్పుతో ఉపాధి హామీ పథకాన్ని తొలగించి దేశంలోని ప్రజలకు ఉపాధి పని లభించకుండా, కార్పొరేట్ సంస్థలకు కార్మికులు ప్రజలు అనిగిమనిగి ఉండాలని, పనిగంటలను పెంచి కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాముడు, తిమ్మప్ప,ఆటో యూనియన్ నాయకులు మధు, హమాలీ సంఘం నాయకులు బజారి, వెంకటేశ్వర్లు, సుంకన్న,మద్ది, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం నాయకులు సులోచనమ్మ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మునిస్వామి,పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,నాగేష్, వెంకటస్వామి, అలీసా, కొళాయిల రాముడు, రుద్రప్ప,చేనేత కార్మిక సంఘం నాయకులు భాష, మల్లయ్య, కిషోర్,శేఖర్, మునిస్వామి సీఐటీయూ నాయకులు లక్ష్మన్న పాల్గొన్నారు.

## కోడుమూరు శ్రీ అయ్యప్ప స్వామి గుడికి విచ్చేయుచున్న మంత్రాలయం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ధర్మపురి క్షేత్రంలో వెలసిన శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయానికి డిసెంబర్ 23వ తేదీ (మంగళవారం) సాయంత్రం 3:30 గంటలకు మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ వారు విచ్చేయనున్నట్లు ఆలయ కమిటీ ఈ సందర్భంగా తెలియజేశారు అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు మాజీ కుడా చైర్మన్, వైయస్సార్సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల హరిచక్రపాణి రెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, టీడీపీ మండల మాజీ కన్వీనర్ కోట్ల కవితమ్మ, కర్నూలు మాజీ కేడీసీసీబీ చైర్మన్, జిల్లా వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు ఎస్వీ విజయ మనోహరి, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఇరిగేషన్ ఎస్ఈ అమడగుంట్ల కృష్ణారెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, వడ్డె నారాయణ (మంత్రాలయం), ఆగ్రహారం నాగిరెడ్డి (ఎమ్మిగనూరు), కొమ్మ రాజు (ఎమ్మిగనూరు), చిట్రెడ్డి జయభరత్ కుమార్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి తదితరులు హాజరవుతారని ఆలయ కమిటీ వారు తెలిపారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు విజయ భాస్కర్ రెడ్డి, మాట్లాడుతూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు స్వామి వారు ముందుగా కోడుమూరు కొత్త బస్టాండ్ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపం నుంచి సాయంత్రం 3:30 గంటలకు రథంపై ఊరేగింపుగా ధర్మపురి ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకుని, ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం, అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అనంతరం హిందూ ధార్మిక ప్రవచనాలు ఉంటాయని కావున భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని వారి సందర్భంగా తెలియజేశారు అలాగే వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జీతూరి రవికుమార్, జొన్నలగడ్డ కిరణ్ కుమార్, కాటేగారి గోపి, ఏసీ రఘు, మాదుగుండు రాఘవేంద్ర, అద్దుగల నాగేశ్వర రెడ్డి, బండ నాగరాజు, ఆకుల ధనుంజయ, కోట్రా అశోక్ కుమార్, వర్కూరు కృష్ణ, డామాం శేఖర్, మాదుగుండు రవిబాబు, పూల శేఖర్, పాండు, తదితరులు పాల్గొన్నారు

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.